# 137వ కీర్తన

**ఈ 137వ కీర్తనను ఎవరు వ్రాశారు ? ఏ సందర్భములో వ్రాసారు ?** అనే విషయం ఏమీ ఆ కీర్తన పై భాగంలో వ్రాయబడలేదు. రకరకాల వ్యాఖ్యాన కర్తలు రకరకాలుగా దీనినిగూర్చి చెప్పారు కాని ఎవరైతే ఆ బబులోను నదుల యొద్ద కూర్చుని సీయోనును జ్ఞాపకము చేసుకొని యేడ్చుచున్నారో వారే ఈ కీర్తనను కట్టి అక్కడ పాడారు అని నేను రూఢిగా నమ్ముచున్నాను.

రాజైన యెహోయాకీము ఏలుబడిలో బబులోను రాజైన నెబుకద్నెజరు యెరూషలేము మీదికి దండెత్తాడు. **యెహో యాకీము దినములలో బబులోను రాజైన నెబుకద్నెజరు యెరూషలేము మీదికి వచ్చెను. (2రాజు. 24:1) అయినను మనష్షే యెహోవాకు పుట్టించిన కోపమును బట్టి ఆయన కోపాగ్ని ఇంకను చల్లారకుండా యూదామీద మండుచునే యుండెను. (2రాజు. 23:26) మనష్షే చేసిన క్రియలన్నింటి బట్టియు, అతడు నిరపరాధులను హతము చేయుటను బట్టియు యూదావారు యెహోవా సముఖమునుండి పార ద్రోలబడునట్లుగా ఆయన ఆజ్ఞ వలన ఇది వారిమీదికి వచ్చెను. (2రాజు. 24:3)**

ఇంతకుముందు ఎప్పుడో రాజు (మనష్షే) చేసిన పాపానికి వీరుకూడా బలికావలసి వచ్చింది. యెహోయాకీము కూడా తక్కువ వాడేమీ కాదు. ఇతను కూడా యెహోవా దేవునికి అమితమైన కోపం రప్పించాడు. ఏమైతేనేమి ? బబులోను రాజు వీరిమీదికి దండెత్తాడు. బబులోను (గ్రీకు భాషలో బాబెలు, నేటి ఇరాక్) కు అనేకమంది చెరగొనిపోబడ్డారు. ఇలా చెరగొనిపోబడిన వారిలో దానియేలు, షద్రక్, మేషక్, అబెద్నగోలు కూడా ఉన్నారు. (దాని. 1:1-6) యెహెజ్కేలు కూడా అలా వెళ్ళినవాడే. అప్పుడు యెహెజ్కేలుకు సుమారు 12 సం॥లు.

ఆ తరువాత సిద్కియా రాజుగా నున్న కాలములో నెబుకద్నెజరు మరలా యెరూషలేముపై దండెత్తాడు. దేవాలయాన్ని కొల్లగొట్టాడు. రాజైన సొలొమోను కట్టించిన దేవాలయములోని బంగారు, వెండి ఉపకరణాలన్నింటిని బబులోనుకు ఎత్తుకు పోయారు. అనేకమందిని చంపేశారు.

వేలమందిని చెరగొన్నారు. చాలామంది చిన్న పిల్లలను బండకేసి బాది వారిని చంపివేశారు. ఒక ప్రక్కన యెరూషలేములో మారణకాండ జరుగు తుంది. జనాల హాహాకారాలు, ఆర్తనాదాలు, మృత్యు ఘోష, రక్తపు టేరులు, బంధీలుగా పట్టుకొనుట నానా భయంకరమైన దృశ్యాలు. భీభత్సాలు జరుగుతున్నాయి.

మరొక ప్రక్క దేవాలయంలో అనుదిన కార్యక్రమాలు, బలి అర్పణలు, స్తుతి కీర్తనలు, వాయిద్యాలతో, తాళమేళాలతో సంగీత కార్య క్రమం, యెహోవాకు స్తుతి, బలి కార్యక్రమాలు జరుగుతున్నవి. సొలొ మోను కట్టించిన యెరూషలేము దేవాలయానికి 14 మెట్లు ఉండేవి. ఆ 14 మెట్లమీద 14 కీర్తనలు పాడేవారు. ఒక్కొక్క మెట్టుమీద ఒక్కొక్క కీర్తన పాడేవారు. ఆ కీర్తన పూర్తి వాయిద్య పరికరాలతో ఏ పరికరాన్ని వాయించడానికి ఏర్పరచబడినవారు ఆ పరికరాన్ని వాయిస్తూ అదే సమయంలో పాటలు పాడుతూ ఉన్నారు. అవి విశ్రాంతి దినమున తప్పించి మిగిలిన వారం రోజులు దైనందిన కార్యక్రమం దేవాలయ పనులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు జరిగేవి. అది కొండ ప్రాంతం. కాబట్టి దాదాపు 3 గంటల ప్రాంతంలో సూర్యాస్త మయం అయ్యేది. సూర్యాస్తమయం అవడంతోనే మరుసటిరోజు మొదలవుతుంది. ఈ 14 మెట్ల మీద పాడేపాటలు ఒక్కొక్క మెట్టుమీద ఒక్కొక్క పాట (యాత్ర కీర్తనలు 120 నుండి 134 వరకు) పూర్తి అవటానికి దాదాపు అరగంట లేదా అంతకు కొంచెం తక్కువ సమయం పట్టేది. మొత్తం 14 పాటలు పాడటానికి సుమారు 6 గంటలు అంటే ఉదయ 9 నుండి సాయంత్రం 3 గంటల వరకు పట్టేది. 135వ కీర్తన కూడా యాత్ర కీర్తనే. దీనిని చివరిగా నైట్ డ్యూటీ చేసేవారికి అంతా క్షేమమే జరుగును గాక అని చెప్పడానికి లేదా బై చెప్పడానికి పాడేవారు. (నాకు ఈ విషయాలు ఒక యూదు క్రైస్తవుడు చెప్పడం జరిగింది)

అంతేకాదు. ఈ సకల వాయిద్యాలతో కూడిన పాటలు పాడే కార్యక్రమం ఎవరు బడితే వారు చేయకూడదు. ప్రతి దానికి కొందరు ఏర్పరచ బడినవారుంటారు. వారు ఆయా వాయిద్యాలను వాయించటంలో

నిష్ణాతులు. వారు పాడుతూ వాయిస్తారు, వాయిస్తూ పాడతారు. ఉదయం 9 గంటలకు వచ్చినవారు ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ, మెట్టుకు ఒక పాట పాడుతూ, చివరి మెట్టుపైకి వచ్చే వరకు వారి కార్యక్రమానికి అంతం ఉండదు. వారు మందిరపు పని నిమిత్తం ఏర్పాటు చేయబడినవారు. అంటే ప్రత్యేకమైన నైపుణ్యం కలిగినవారని అర్థం. వారి వారి ఇళ్ళవద్ద వారిని ప్రత్యేకంగా చూసేవారు.

మరొక ముఖ్య విషయమేమంటే వారు అలా గాన పరిచర్య చేస్తున్నప్పుడు శత్రువు మీదపడి, తన కత్తిని వీరి గొంతుపై పెట్టినాగాని వీరు అలా వాయించడం, పాడటం ఆపకూడదు. అలా వాయిస్తూనే అలా పాడుతూనే శత్రువుచే సంహరింపబడనైనా సంహరింపబడాలి గాని వాటిని అక్కడ వదిలేసి మరణంనుండి తప్పించుకోవడానికి పారి పోకూడదు. అసలు అలా పారిపోయే వారు ఆ పనికి పనికిరారు.

అసలు వారు పాడే పాటలే అవి. **"మనుష్యులు మన మీదికి లేచి నప్పుడు యెహోవా మనకు తోడై యుండని యెడల వారి ఆగ్రహము మనపైకి రగులు కొనినప్పుడు యెహోవా మనకు తోడైయుండని యెడల వారు మనలను ప్రాణముతోనే మ్రింగివేసి యుందురు"** (కీర్తన 124:1-3)

నెబుకద్నెజరు దండెత్తినప్పుడు సరిగ్గా అదే జరిగింది. ఒక ప్రక్క మారణ కాండ, దహనకాండ జరుగుతుంది. పరిస్థితి అంతా వీళ్ళకి పూర్తిగా అర్థమవుతుంది. కానీ వీళ్ళు మాత్రం మందిరపు సేవా కార్య క్రమాల్లో నిమగ్నమై ఉన్నారు. ఎదురుగా కత్తులు పట్టుకొని బబులోను సైన్యం ఉంది. బహుశా వీరి తలలు తెంపేయవచ్చు. వీరిని నరికి వేయవచ్చు. లేదా బందీలుగా పట్టుకొనిపోవచ్చు. వీరి ప్రాణాలకు ఏమైనా జరగవచ్చు. అయినా గాని ఎవ్వరు కదలలేదు, తొణకలేదు, చెదరలేదు. యెహోవా దేవుని పనిని అకస్మాత్తుగా అక్కడ ఆపేసి వారి ప్రాణాలను రక్షించుకోవడానికి పారిపోలేదు. మీరు మా తలలు నరికినా సరే మేము పాడేది పాడేదే. వాయించేది వాయించేదే అని వారి పనిని వారు చేసుకొనిపోతున్నారు. బబులోను సైన్యం వారి పాటలకు, వారి స్థైర్యానికి, వారి నిబద్ధతతకు ముగ్ధులయ్యారు. బబులోను రాజు ముగ్ధుడయ్యాడు. వారి పాటలను ఎంతసేపు ఆలకించారో మరి. వారిని మాత్రం ఏమీ చేయలేదు.

వారిమీద ఎంతో ఇష్టత పెంచుకున్నారు. దేవాలయాన్ని అయితే ధ్వంసం చేశారు. బంగారం కూడా దోచుకున్నారు. కాని వీరిని మాత్రం ఏమీ చేయలేదు. వీరు కూడా వారి పనిని ఆపలేదు. చివరికి చాలా మందిని బందీలుగా పట్టుకొనిపోయారు.


అలా బందీలుగా కొనిపోబడిన వారిలో వీరుకూడా ఉన్నారు. కాని వీరిని బందీలుగా పట్టుకొని వెళ్ళేటప్పుడు బబులోను సైన్యం వీరితో పాటు వీరి వాయిద్య పరికరాలను కూడా తెమ్మని చెప్పింది. ఎవరి పరికరాలను వారు పట్టుకొని బబులోనుకు కొనిపోబడ్డారు. అక్కడ వారిని యూఫ్రటీసు, టైగ్రిస్ నదుల మధ్య దింపారు. వాగ్దత్త దేశములోనుండి అన్యుల దేశములోనికి బందీలుగా కొనిపోబడ్డారు. వీళ్ళు చేయని నేరానికి వీరు అన్య దేశంలో బందీలుగా కొనిపోబడవలసి వచ్చింది. వీరు ఎంత హృదయ పూర్వకంగా ఎంత నిష్ఠతో, ఎంత నిబద్ధతతో యెహోవా దేవుని ఆలయ పనిలో ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ఆలయ పనిచేస్తూ ఉంటే ఎవరో చేసిన పాపానికి వీరు కూడా బలి అవ్వవలసి వచ్చింది.

అక్కడ యూఫ్రటీసు, టైగ్రిస్ నదులమధ్య ఉంచబడ్డారు. వీరి సితారాలు ఇతర వాయిద్య పరికరాలను అక్కడ ఉన్న నిరవంజి చెట్లకు వ్రేలాడదీసి, సీయోనును జ్ఞాపకం చేసికొని దుఃఖం ఆపుకోలేక కన్నీళ్ళు విడుస్తూ కూర్చొని ఏడుస్తున్నారు.

**బబులోను నదుల యొద్ద కూర్చుండినప్పడు మనము సియోనును జ్ఞాపకము చేసికొని యేడ్చుచుంటిమి (కీర్తన 137:1) వాటి మధ్య నున్న నిరవంజి చెట్లకు మన సితారాలు తగిలించితిమి.** (కీర్తన 137:2) నిరవంజి చెట్లకు వాళ్ళ సితారాలు తగిలించారు. చక్కగా ఆడి పాడవలసినవారు ఎంతో దుఃఖంతో, ఏడుస్తూ మూగబోయిన ఆ సితారాలను నిరవంజి చెట్లకు తగిలించారు.

ఈ నిరవంజి చెట్లు చూస్తానికి జుట్టు బాగా విరబోసికొని ఎంతో దుఃఖంతో, విచారంతో, పిచ్చి పిచ్చిగా ఉన్న ఒక స్త్రీని పోలి ఉంటాయి. అవి విచారానికి, దుఃఖానికి, ఏడ్పుకు, సర్వం కోల్పోయామనే అన్న భావనకు గుర్తుగా ఉంటాయి. ఆ చెట్లకు తమ సితారాలను తగిలించిన

ఈ సీయోను వాసులు కూడా అదే స్థితిలో ఉన్నారు. చక్కగా దేవాలయంలో దేవుని పరిచర్య చేయవలసిన వారు ఈ దుస్థితికి రావడం వారికి భరించ లేని బాధగా ఉంది. సీయోను అలా అయిపోయిందే అని సీయోనును గూర్చిన వేదన.




ఇంతలో వీళ్ళని బందీలుగా పట్టుకొని వచ్చిన ఆ బబులోను వారు తీరుబడిగా వచ్చి వాళ్ళ కోసం సీయోను పాటలలో ఒక పాటపాడి వినిపించమని అడగడానికి వచ్చారు. **"అచ్చట మనలను చెరగొన్నవారు ఒక కీర్తన పాడుడి అనిరి. మనలను బాధించినవారు సీయోను కీర్తనలలో ఒక దానిని మాకు వినిపించుడి అని మనవలన ఉల్లాసము గోరిరి".** (కీర్తన 137:3)

వీరి పాటలు యెరూషలేము దేవాలయంవద్ద విన్నారు. విని ముగ్దులై పోయారు. ముగ్దులై వారిని వారి దేశం పట్టుకుపోయారు. పట్టుకు పోయి ఇప్పుడు వారి ఆనందం కోసం మరల పాడమంటున్నారు. వీరి నిబద్దత వారికి తెలియదు. అన్యుల దేశంలో యెహోవా దేవుని కీర్తనలు ఎట్టి పరిస్థితులలోను పాడరని వారికి ఏ మాత్రం తెలియదు. యెహోవా కీర్తనలు పాడే నోరు అన్యుల దేశంలో పాడదని వారికి తెలియదు. యెహో వాకు కీర్తనలు వాయించే చేయి అన్యులకు వాయించ దని వారికి తెలియదు. చెప్పినా అర్థం చేసుకోలేరు. వీరికి అది అత్యంత ప్రాముఖ్యం. కాని వారికది అతి సామాన్య విషయం.

ఈ రోజున అనేకమంది క్రైస్తవులకు యెహోవా మందిరము అని లేదు, అన్య దేవుళ్ళ మందిరం అనిలేదు. ఏదైనా వీరికి ఒకటే. వీరికి కావలసింది బిజినెస్. ఇక్కడా పాడతారు. అక్కడా పాడతారు. ఇక్కడా వాయిస్తారు. అక్కడా వాయిస్తారు. ఇక్కడ దేవుని మందిర కార్యక్రమములలో

పాల్గొంటారు ఇక్కడ భక్తి అక్కడ భుక్తి అంటారు. అది మీ యిష్టం. కాని ఈ సీయోను బిడ్డలు మాత్రం మాకు అది పడదు అంటున్నారు. మాకు భుక్తి లేకపోయినా పరవాలేదు. మా ప్రాణం పోయినా పరవాలేదు. మాకు భక్తే ముఖ్యం అంటున్నారు. దాంతో అదే విషయాన్ని ఆ బబులోను వారికి పాట రూపంలో చెప్పారు. ఆ పాటలు మీ కోసం, మీ ఆనందంకోసం ఈ అన్య దేశంలో మేము పాడేది లేదు అని ఖరా ఖండిగా చెప్పేశారు. సీయోను పాటలలో ఒకటికూడా అక్కడ పాడలేదు. మా యెరూషలేమును మేము మరచిపోలేమని ఖచ్చితంగా చెప్పేశారు. దానిని జ్ఞాపకము చేసికోకుండా ఉండలేమని చెప్పారు. మా ముఖ్య సంతోషంకంటే యెరూషలేమే లేదా మా దేవుని ఆలయమే లేదా మా దేవుని పనే మాకు అతిముఖ్యమని చెప్పేశారు. పాట రూపంలో ఈ విషయాలన్నీ అప్పటికప్పుడు పాటకట్టి, పాడుతూ–వాయిస్తూ, వాయిస్తూ– పాడుతూ చెప్పారు.

అంతేకాదు వారు యెరూషలేమును మరిచిపోతే వారి కుడి చేయి తన నేర్పును మరచును గాక అని శపించుకుంటున్నారు. (కీర్తన 137:5) తన కుడిచేయి తన కార్యము మరచిపోతే లేక ఆ కుడిచేయికి పక్షవాతం వస్తే ఇక ఆ సితారాను చమత్కారంగా ఎలా వాయించగలరు ? అతను సితారాను వాయించలేకపోతే అదే అతని ప్రాణం, గౌరవం.వాయించలేని క్షణాన ఇంక అతను ఎందుకు పనికిరానివాడే అవుతాడు. "నేను నిన్ను జ్ఞాపకము చేసికొనని యెడల నా ముఖ్య సంతోషముకంటే నేను యెరూష లేమును హెచ్చుగా ఎంచని యెడల నా నాలుక నా అంగిటికి అంటు కొనును గాక" అంటున్నారు (కీర్తన 137:6)

యెరూషలేమును జ్ఞాపకము చేసికొనకుండా వారి ముఖ్య సంతోషముకంటే యెరూషలేమును హెచ్చుగా ఎంచకుంటే అతని నాలుక అతని అంగిటికి అంటుకొనిపోతుందని శపించుకుంటున్నాడు. అలా గనుక జరిగితే ఇంక అతను పాటపాడలేడు. కనీసం మాట్లాడలేడు కూడా. కాబట్టి వారి పాట, ఆట మొత్తం దేవునికే అంకితం. అలా కాని పక్షంలో ఇక వారు పాడలేరు, ఆడలేరు **(ఆడలేక పోవడం అంటే వాయిద్య పరికరాలను**

**వాయించలేరు అని)** వారికి అదే జీవితం. వారి జీవితం మొత్తం దేవునికే అంకితం. అలా కాని పక్షంలో వారు నిరర్థకులు అని చెప్పుతున్నారు. మరి మన పరిస్థితి ఏమిటి ? వారివలె ఉందామని కోరుకుందామా ? వారివలె ఉందామా ? ఆ బిడ్డలకొచ్చిన కష్టాలకంటే మనకు వచ్చే కష్టాలు ఎక్కువ కావేమో. వారి తల్లిదండ్రులు సోదరులు, సోదరీలు బ్రతికి ఉన్నారో, చంప బడ్డారో ? బ్రతికి ఉన్నా బందీలుగా ఉన్నారో, ఇంటివద్దనే అనాధులుగా ఉన్నారో? వీరికి ఎప్పటికి విముక్తి దొరుకుతుందో ? అసలు వారి జీవితాలకు విముక్తి ఎప్పటికి వస్తుందో అన్నీ అగమ్యగోచరం. అయినాగాని వారు వీటన్నింటిని గూర్చి ఆలోచించడంలేదు. సీయోను గురించి, దేవాలయం గురించి, దేవుని పని గురించి మాత్రమే ఆలోచిస్తున్నారు, చింతిస్తున్నారు, విలపిస్తున్నారు.

పాట పాడుతూ ఉన్నారు. మ్యూజిక్ చాలా బాగుంది. బబులోను వారు విని ఆనందిస్తున్నారు. ఏమి పాడుతున్నారో ఆ మాటలు వారికి అర్థం కావడం లేదు. వీరి భాష వారికి రాదు. వారిది కల్దీయ భాష. వీరిది హెబ్రీభాష. ఏదో మంచి సీయోనుపాట పాడుతున్నారని విని ఆనందిస్తున్నారే తప్ప ఏమి పాడుతున్నారో వారికి తెలియటం లేదు. ఆ వినేవారు ఈ పాడేవారిని అనేక విధాలుగా బాధించినవారే.

అయినాగాని వీరి పాటలో వారిమీద దేవునికి ఫిర్యాదు చేయడం లేదు. శత్రువు మీద ఫిర్యాదు చేయడం లేదు. ఎందుకంటే దేవుడు వారికి తగిన శాస్తి చేస్తాడని తెలుసు. కాని ఒకరిమీద యెహోవాకు ఫిర్యాదు చేస్తున్నారు. వారు ఎదోమీయులు. యెహోవా, ఎదోము జనులు చేసికొనినది జ్ఞాపకము చేసికొనుము. యెరూషలేము పాడైన దినమును జ్ఞాపకమునకు తెచ్చుకొనుము. దానిని నాశనము చేయుడి. సమూల ధ్వంసము చేయుడి అని వారు చాటిరి గదా (కీర్తన 137:7)

ఈ ఎదోము ఎవరు ? ఎదోము అనగా ఏశావు. ఏదోమను ఏశావు వంశావళి ఇదే **(ఆది. 36:1)** ఏశావు అనగా ఎదోము **(ఆది. 36:8)** ఈ ఏశావు వంశస్థులు అనగా ఎదోమీయులు ఏశావు తమ్ముడైన యాకోబు వంశస్థులను అనగా ఇశ్రాయేలీయులకు యెరూషలేము పాడుచేయబడిన

రోజున తీవ్రమైన అపకారం చేశారు. వారు నెబుకద్నెజరు, అతని సైన్యంకి అండగా నిలిచారు. వారితో కలిసిపోయారు. వీరు శ్రమ నొందుతుంటే వారు చూచి ఆనందించారు. వాళ్ళు నాశనం అవుతుంటే చూచి సంతోషించారు. బబులోనువారు వీరిని దోచుకుంటుంటే వీరు కూడా వారితో కలిసి దోచుకున్నారు. వీరి ఆస్థిని పట్టుకుపోయారు. వీరిలో ఎవరైనా పారిపోతుంటే దారిలో అడ్డంగా నిలుచొని బబులోను వారిచేత సంహరించ బడడానికి సహాయ పడ్డారు. ఎవరైనా దాగుకొని ఉంటే బబులోను వారికి వీరిని పట్టిచ్చి అప్పచెప్పారు. **(ఓబద్యా 1:10-14)**

ఇన్ని చేసినాగాని ఈ సీయోను బిడ్డలు పాడే పాటలో ఈ విషయం వేలెత్తి చూపడంలేదు. ఒకే ఒక్క విషయం వారికి చాలా బాధ కలిగించింది. ఆ విషయాన్నే దేవునికి ఫిర్యాదు చేస్తున్నారు. దాన్ని జ్ఞాపకం చేసుకోమని దేవునిని అడుగుతున్నారు. వారికి గట్టి శిక్ష వేయమని కూడా చెప్పడంలేదు. అదికూడా దేవుని ఇష్టానికే వదిలేస్తున్నారు. ఒకవేళ దేవునికి వారిని క్షమించడం ఇష్టం అయితే అది కూడా వీరికి ఆమోదమే అయి ఉండవచ్చు. ఆ బాధపరచిన ఆ ఒక్క విషయం ఏమంటే - వారు యెరూషలేమును నాశనం చేయుడి, సమూల ధ్వంసం చేయుడి అని వారు బబులోను సైన్యానికి చెప్పిన విషయం. యెరూషలేమును సమూల ధ్వంసం చేయమని చెప్పిన విషయంలో వీరు అమితమైన ఆవేదనని చెందారు. స్వయంగా వీరికి ఎంత అపకారం చేసినా పట్టించుకోలేదు. కాని దేవుని పట్టణాన్ని, దేవుని ఆలయాన్ని నాశనం చేయండని చెప్పడం మాత్రం వీరికి తీవ్ర ఆవేదనని కలిగించింది.


కాని దేవుడు ఓబద్యా ప్రవక్త ద్వారా ముందుగానే చెప్పాడు. చాలామంది వ్యాఖ్యాన కర్తలు ఓబద్యా దీనిని క్రీ.పూ. 8వ శతాబ్దంలో ప్రవచించాడని చెప్తారు. ఓబద్యా ఎప్పుడు వ్రాసాడు అనే దానికి నిదర్శనాలు లేవు. కాని ఇది క్రీ.పూ. 7వ శతాబ్దం మొదట్లో అంటే నెబుకద్నెజరు యెరూషలేముపై దండెత్తిన తర్వాత వ్రాసి ఉండవచ్చు. దేవుడు ఓబద్యా ద్వారా చెప్పిన దేమంటే **"యెహోవా దినము అన్య జనులందరి మీదికి వచ్చుచున్నది. అప్పుడు నీవు చేసినట్లే నీకును చేయబడును. నీవు చేసినదే నీ నెత్తిమీదికి వచ్చును".** (ఓబద్యా 1:15) అంటున్నాడు. వారు యాకోబు సంతతి

వారికి ఏమి చేస్తే ఒకానొక దినమున వారికి కూడా అలాగే జరుగుతుందని చెప్పాడు. బందీలుగా పట్టబడిన, చెరగొనిపోబడిన ఆ యాకోబు సంతతి వారు మరలా తిరిగొచ్చి వారి వారి స్వాస్థ్యములను తిరిగి పొందుతారు. కాని ఏశావు సంతతివారైన మీరు మాత్రము ఇకెన్నటికీ లేకుండా నాశన మవుతారని అంటున్నాడు. (17వ)

సొంత తమ్ముని సంతతివారికే ఇలా చేశారు. ఈనాడు కూడా మనం మన సొంత వారి కుటుంబాల పట్ల ఎలా ఉంటున్నాము ? వారు బాధలలో ఉంటే మనము వారి బాధలనుబట్టి సంతోషిస్తున్నామా ? వారిని శత్రువుకు అప్పగిస్తున్నామా? వారి ఆస్తులను కాజేస్తున్నామా ? అయితే దేవుడు వారి బాధలను తొలగించి వారి ఆస్థులను వారికి అప్పజెప్పి మరలా వారు పూర్వ వైభవాన్ని పొందేలా చేసి అవన్నీ మన మీదికి రప్పిస్తా డేమో జాగ్రత్త పడుడి. మరియు దేవునికి సంబంధమైనవి ఎట్టి పరిస్థితుల లోనూ నాశనం అవ్వాలని కోరుకోకండి.

ఇప్పుడు చివరిగా ఆ సీయోను బిడ్డలు బబులోను గురించి పాడు తున్నారు **"బబులోను కుమారీ, నీవు మాకు చేసిన క్రియలను బట్టి నీకు ప్రతీకారము చేయువాడు ధన్యుడు. నీ పసిపిల్లలను పట్టుకొని వారిని బండకేసి కొట్టువాడు ధన్యుడు".** (కీర్తన 137:9) వారిపై ప్రతీకారము తీర్చుకొనువాడు ఒకడున్నాడని వారికి బాగా తెలుసు. వీళ్ళ పసివారిని బండకేసి కొట్టినట్లు వాళ్ళ పసివారిని బండకేసి కొట్టువాడు ఒకడున్నాడని వారికి బాగా తెలుసు. ఆయన సర్వశక్తి మంతుడైన యెహోవా దేవుడు. అక్కడ ఆయన నామాన్ని ఉచ్ఛరించడం లేదు. కాని తప్పక వారికి ఆయన తగిన శాస్తి చేస్తాడని పూర్తి నమ్మకం. నీ పిల్లల్ని మా దేవుడు బండకేసి కొడతాడు. మిమ్మల్ని పాడు చేస్తాడు అని వారికి డైరెక్ట్‌గానే చెప్తున్నారు. కాని వారు గ్రహించే స్థితిలో లేరు. వారికి వీరి భాష అర్థంకావడం లేదు. ఆహా ! పాట ఎంత బాగుంది ? అని దాని మ్యూజిక్‌ని ఆనందిస్తున్నారు. కాని పాట అర్థం తెలుసుకోలేక పోతున్నారు. ఆ పాట వారిని తిడుతూ, దేవుని పొగడుతూ పాడుతున్నారని తెలిస్తే వారు వీరిని ఏమైనా చేయగలరు. అయినా వారు చేయాలనుకున్నది చేశేసారు. చెప్పాలనుకున్నది చెప్పేశారు. ఆ తర్వాత దేవుడు వీరిని కరుణించాడు. వీరిలో చాలామంది మరలా వారి వారి స్వస్థలాలకు వెళ్ళిపోయారు. వీరికంటే ముందుగానే చెరగొనిపోబడ్డ దానియేలు ఆ దేశ ప్రధానులలో ఒకడుగా ఉన్నాడు. చాలామంది రాజులు మారినాగాని దానియేలు మాత్రం వారి ప్రభుత్వాలలో ముఖ్యుడుగానే వెలుగొందాడు. అంత్య దినాలకు సంబంధించిన అనేక నిగూఢమైన మర్మాలను దేవుడు దానియేలుకు చూపించాడు. నేటి

ఇశ్రాయేలు పరిస్థితులకు సంబంధించిన విషయాలన్నీ దేవుడు యెహెజ్కేలుకు చూపించాడు. ఈ రాబోయే కాలంలో కట్టబడే మందిర నిర్మాణం ఎలా ఉండాలో దేవుడు యెహెజ్కేలు ద్వారా ముందుగానే చూపించాడు. ఇప్పుడు అదే ప్లాన్ ప్రకారం యెరూషలేము మందిర నిర్మాణం జరుగబోతుంది. ఇప్పుడున్న యెహెజ్కేలు పుస్తకాన్ని యెహెజ్కేలు 66 రాతి పలకలమీద చెక్కించాడట. ఆ 66 పలకలను బబులోనులో యెహెజ్కేలు సమాధిలో పెట్టి అతన్ని సమాధి చేశారట. సుమారు 100 సం॥ క్రితం బబులోనులోని యెహెజ్కేలు సమాధిలో ఈ 66 రాతి పలకలు బల్పడినవి. ఇప్పుడవి ఇశ్రాయేలు దేశంలో ప్రజలు చూడడానికి ఒక చిన్న మ్యూజియంలో ఉంచారు. దేవునికి అనుకూలంగా ఉన్న వారెప్పుడూ పై వారిగానే ఉంటారు. వ్యతిరేకంగా ఉన్న వారెప్పుడూ నాశనం అవుతూనే ఉంటారు. దానియేలు 80 సం॥లు పైబడి జీవిం చాడు. మనదేశం కూడా కొంతకాలం పారసీక రాజుల పాలనలో ఉంది. హిందూ దేశము మొదలుకొని కూషు దేశమువరకు గల 127 సంస్థానాలలో మన హిందూదేశము కూడా ఒక భాగం. కాబట్టి ఏదైనా మరవండి గాని, యెరూషలేమును మరువవద్దు. యెరూషలేముకంటే మరి దేనికి మీ ముఖ్యసంతోషముగా పెట్టుకోవద్దు.


బబులోనులో దానియేలును సింహాల గుహలో వేసిన ప్రదేశంగా భావిస్తున్న చోట గల ఆనాటి సింహం విగ్రహం

**రాజ్యసువార్త**

**నెలవారి పుస్తకాలను పొందగోరువారు సంవత్సరానికి రూ. 150/-**
**చందాను మా చిరునామాకు మని ఆర్డరు ద్వారా లేదా ఆన్‌లైన్ ద్వారా పంపగలరు.**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడివాడ బజార్ బ్రాంచ్**
**అకౌంట్ నెం. డి. శామ్యూల్ 10304581065**

మా చిరునామా : **ఎడిటర్, రాజ్యసువార్త,**
E 2, సాత్విక్స్ కార్పొరేట్ రెసిడెన్సీ, సత్యనారాయణపురం,
**గుడివాడ - 521 301.** కృష్ణాజిల్లా సెల్ : 9394222015

**రాజ్య సువార్త పత్రికను www.rajyasuvaartha.teluguchristian.in అను వెబ్‌సైట్‌లో చూడవచ్చును**